క్లుప్తంగా

పునర్విభజన ముసాయిదాల ప్రదర్శన



నందిగామ టౌన్: నందిగామ నగర పంచాయతీ ద్వితీయ శ్రేణి పురపాలక సంఘంగా ఉన్నతీకరణ దృష్ట్యా 28 వార్డులుగా పునర్విభజన చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ లోవరాజు పేర్కొన్నారు. వార్డుల విభజన ముసాయిదా ప్రతులను పట్టణంలోని ఆర్డీఓ, తహసీల్దార్, మండల పరిషత్, సబ్ రిజిస్ట్రార్, ఉప ఖజానా, తపాల శాఖ, పురపాలక శాఖ కార్యాలయ నోటీస్ బోర్డులో మంగళవారం ఆయన ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు పునర్విభజన ముసాయిదాపై అభ్యంతరాలు, సూచనలు అక్టోబరు ఆరో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా మున్సిపల్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా అందించాలన్నారు. అభ్యంతరాలను పరిశీలించి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన తెలిపారు.

డీఎస్సీ విజేతలకు ఘన సత్కారం



జగ్గయ్యపేట అర్బన్: ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)నివాసంలో మంగళవారం ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో నియోజకవర్గంలో డీఎస్సీ- 2025లో ఉపాధ్యాయులుగా, భాషా పండితులుగా, ఫిజికల్ డైరెక్టర్లుగా ఎంపికైన 75 మందిని సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య, శ్రీదేవి దంపతులు డీఎస్సీ విజేతలకు నూతన వస్త్రాలు, సర్వీసు రిజిస్టర్లు అందజేశారు. కార్యక్రమంలో మూడు మండలాల ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో కృష్ణంరాజు సతీమణి



మధురానగర్(విజయవాడ సెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెబల్‌స్టార్ కృష్ణంరాజు సతీమణి మంగళవారం ఉప్పలపాటి శ్యామలదేవి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విజయవాడ ప్రభాస్ ఫ్యాన్స్ నాయకులు నున్న శివ నాగేశ్వరరావు, యు.కనకరావు, డి.మురళీకృష్ణంరాజు శ్యామలదేవిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ముత్యాలంపాడులో కృష్ణంరాజు విగ్రహం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఫ్యాన్స్ వివరించారు. కార్యక్రమంలో మన్నం వెంకటేశ్వరావు, గుర్రం సుబ్బారావు, విజయ సారథి, కార్తీక్, గణేష్, అనిల్ యాదవ్, మల్లినేని రమణయ్య, ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టం చేసినా ఆగని వీఐపీ దర్శనాలు

ఆలయ పరిసరాల పరిస్థితిపై ఈవో ఆగ్రహం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దర్శనానికి క్యూలైన్లలో రద్దీ సాధారణంగా ఉన్నప్పటికీ అందరూ వీఐపీ దర్శనాలకే మొగ్గు చూపడంతో ఆలయ ప్రాంగణంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. మంగళవారం మధ్యాహ్నం వీఐపీ టైం స్లాట్‌కు గంట ముందు నుంచే వీఐపీల తాకిడి మొదలైంది. ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల అధికారులు, వారి కుటుంబ సభ్యులు అమ్మవారి దర్శనానికి ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. కాగా ఆ సమయంలో రూ.300, రూ.100 టికెట్లతో పాటు ప్రత్యేక క్యూలు ఖాళీగానే ఉన్నాయి. అయితే వీఐపీల పేరిట విచ్చేసిన వారందరూ గాలి గోపురం, సీఎం గేటులో నుంచే దర్శనం కోసం బారులు తీరారు. అదే సమయంలో ఆలయ ఈవో శీనా నాయక్ పరిస్థితిని సీసీ కెమెరాల్లో గమనించారు. గాలిగోపురం వద్దకు చేరుకున్న ఈవో సెక్యూరిటీ, పోలీసు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరినీ వీఐపీ, సీఎం గేటు ద్వారా దర్శనానికి పంపవద్దని హెచ్చరించారు. దీంతో లక్ష్మీగణపతి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్దే భక్తులను పోలీసులు నిలిపివేశారు. సుమారు 3 గంటల పాటు ఎవరినీ అనుమతించకపోవడంతో భక్తులు గుంపులు గుంపులుగా చేరిపోయారు. మరో వైపు సింహం విగ్రహాల గేట్ల వద్ద భక్తులు తోపులాటకు గురై మహిళలు, చంటి పిల్లలు కేకలు వేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

దుర్గమ్మా.. కరుణించమ్మా..

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లాలోని అన్ని ఆలయాల్లో అమ్మవార్లు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఆయా ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. పలు ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



నందిగామలో కనకదుర్గమ్మగా శుకశ్యామలాంబ అమ్మవారు



కంచికచర్ల మహాలక్ష్మి ఆలయంలో చంద్రఘంటదేవిగా అమ్మవారు



మక్కపేట ఆంజనేయస్వామి ఆలయంలో అమ్మవారు



మంగొల్లు రామాలయంలో..



కంచికచర్లలో అమ్మవారికి పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సురేష్‌బాబు



కనకదుర్గాదేవిగా దర్శనమిచ్చిన అంబారుపేట సత్యమ్మ అమ్మవారు



పల్లగిరి త్రిశక్తి పీఠంలో సామూహిక కుంకుమార్చన



పెద్దాపురంలో కనకదుర్గాదేవి అలంకారంలో అమ్మవారు

వీరులపాడు: దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం కనకదుర్గా దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని కనకదుర్గా దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. రాత్రికి మహిళలు బతుకమ్మలాడి గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. మండలంలోని అల్లూరు గ్రామంలోని సీతారామచంద్ర స్వామి సహిత మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారు కనకదుర్గమ్మ అమ్మవారి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కంచికచర్లలో..

కంచికచర్ల: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఫైర్ స్టేషన్ రోడ్డులో అమ్మవారికి వైఎస్సార్ సీపీ నాయకులు వేమా సురేష్‌బాబు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారిని చంద్రఘంట దేవిగా అలంకరించారు. వసంతకాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద, స్థానిక శివసాయిక్షేత్రంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు చేశారు.

వత్సవాయిలో..

వత్సవాయి : మండలంలోని పలు ఆలయాల్లో మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మక్కపేట, చిట్టేల, మంగొల్లు, వత్సవాయి గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటుచేశారు.

నందిగామలో..

నందిగామ రూరల్: దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అంబారుపేటలో సత్యమ్మ అమ్మవారు మంగళవారం కనకదుర్గగా దర్శనమిచ్చారు. ఈఓ సీతారావమ్మ, ఆలయ చైర్మన్ మంచాల మాధవరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. లింగాలపాడు గ్రామంలో లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారు, పెద్దవరంలోని అంకమ్మ అమ్మవారు, గోళ్లమూడిలోని శంభులింగేశ్వర స్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారుతోపాటు తదితర ఆలయాల్లో అమ్మవారు కనకదుర్గమ్మ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నందిగామ టౌన్‌లో..

పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుకశ్యామలాంబ, వాసవీ కన్యకా పరమేశ్వరీ, మరిడీ మహాలక్ష్మీ ఆలయాల్లో అమ్మవార్లు మంగళవారం కనకదుర్గమ్మ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చనతో పాటు శ్రీచక్ర నవవర్ణనార్చన మూలమంత్ర హోమాది క్రతువులను జరిపించారు. రామలింగేశ్వర నగర్‌లోని పలు ఆలయల్లో అమ్మవార్లకు విశేష పూజలు చేశారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: స్థానిక తూర్పు బజారులో శ్రీదుర్గా మల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిరిలో అమ్మవారు మంగళవారం దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రీతిరుపతమ్మ ఆలయంలో కుంకుమ పూజ నిర్వహించారు. పెనుగంచిప్రోలు టౌన్ సెంటర్, పాత సినిమాహాల్ సెంటర్‌లో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం, నవాబుపేట, ముచ్చింతాల, కొణకంచి ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముండ్లపాడులో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ శాంతిలక్ష్మి, వీఆర్‌ఓ అనూష పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్ : శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా స్థానిక నకాశిబజారులోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రీచండి మూలమంత్ర సహిత రుద్రహోమం, సామూహిక లలితపారాయణం, కుంకుమార్చన నిర్వహించారు. అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో శ్రీమహాచండీ హోమం నిర్వహించారు. దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చన, శ్రీలక్ష్మీగణపతి రుద్రహోమాలు చేశారు. చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి ఆలయంలో శ్రీసోమవంశ సహస్రార్జున క్షత్రియ(ఖత్రి) సమాజ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

జగ్గయ్యపేట: మండలంలో దసరా ఉత్సవగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని గౌరవరం, కెఅగ్రహారం, తిరుమలగిరి, ముక్త్యాల, అనుమంచిపల్లి, బండిపాలెం గ్రామాల్లోని ప్రత్యేక మంటపాల్లో కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలకు అర్చకులు కనకదుర్గమ్మ అలంకారం చేసి పూజలు చేశారు. మంటపాల వద్ద మహిళలు కుంకుమ పూజ, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. గౌరవరంలోని అమ్మవారిని పలు రకాల కూరగాయలు, పండ్లతో అలంకరించారు.



గౌరవరంలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు



ముక్త్యాలలో దుర్గాదేవిగా అమ్మవారు



పెనుగంచిప్రోలు తూర్పుబజారులో దుర్గాదేవిగా అమ్మవారు



పేటలోని శ్రీరేణుకాపరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవిగా అమ్మవారు



పేటలో దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో దుర్గాదేవి అలంకారం



పేటలోని మహాలక్ష్మి వెండి ఆలయంలో దుర్గాదేవిగా అమ్మవారు

ఉద్ధృతంగా ప్రవహిస్తున్న చంద్రమ్మ కయ్య



ముక్త్యాల వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న చంద్రమ్మ కయ్య

జగ్గయ్యపేట: మండలంలోని ముక్త్యాల గ్రామ సమీపంలోని పులిచింతల ప్రాజెక్టు నుంచి వరద ఉద్ధృతి కొనసాగుతోంది. మంగళవారం 18 గేట్ల ద్వారా ఆరు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో నదీ పరివాహక గ్రామాలైన ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాల్లో ఉద్ధృతి కొనసాగుతుంది. మూడు రోజులుగా జగ్గయ్యపేట-ముక్త్యాల రహదారిలోని చంద్రమ్మ కయ్య ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. అంతే కాకుండా ఆయా గ్రామాల్లోని పత్తి, మిర్చి పంటలు వరద నీటిలో దర్శనమిస్తున్నాయి. రావిరాల గ్రామంలోని నది ఒడ్డునున్న ప్రజలు ఇళ్లు కూలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.



ముక్త్యాల వద్ద వరద నీటిలో పత్తి పంట

సిమెంట్ కర్మాగారం పరిశీలన

బూదవాడ(జగ్గయ్యపేట): బూదవాడ గ్రామంలోని అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారాన్ని మంగళవారం చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ విజయవాడ శివకుమార్‌రెడ్డి పరిశీలించారు. కర్మాగారంలోని భద్రతా ఏర్పాట్లను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం ఇద్దరికి గాయాలయ్యాయనే వచ్చిన వార్తల నేపథ్యంలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్మికుల భద్రతపై నిర్లక్ష్యం వహించొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్లాంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లించాలి

తిరువూరు: తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేసే కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్నారని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌కే మీరా అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ నాయకులు తిరువూరు ప్రభుత్వాస్పత్రిని సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య కార్మికులతో పాటు ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో పనిచేసే 30 మందికి పైగా కార్మికులకు కాంట్రాక్టరు జీతాలు చెల్లించకపోవడంతో ఆయా కుటుంబాలు పస్తులుండే పరిస్థితి నెలకొందన్నారు. అరకొర జీతాలిస్తూ నెలల తరబడి జీతాలు పెండింగ్ పెట్టడం శోచనీయమని చెప్పారు. వెంటనే జీతాలు చెల్లించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.


పెసరకు గిట్టుబాటు ధర కల్పించరా?

- క్వింటా పెసలు రూ.6వేలకు పడిపోయిన వైనం
- వైఎస్సార్ సీపీ పాలనలో క్వింటా ధర రూ.9,700

కంచికచర్ల: ప్రకృతి వైపరీత్యాలతో పెసర పంట ఆశించిన దిగుబడులు రాక రైతులు ఆందోళన చెందుతుంటే మరో పక్క ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పెసలను కొనుగోలు చేయకుండా తాత్సారం చేస్తోందని అన్నదాతలు మండిపడుతున్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే ఎటువంటి కొనుగోళ్లు చేయకపోవటంతో ఇదే అదునుగా భావించి మధ్య దళారులు పుట్టగొడుగుల్లా వెలసి రైతులను మోసం చేసేందుకు సిద్ధమయ్యారు. తక్కువ ధరకు పెసలు కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది రైతులు తమ పెసలను విక్రయించకుండా గిడ్డంగుల్లో నిల్వ ఉంచారు. కనీస మద్దతు ధర లేకపోవటంతో రైతులు కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

2,868 హెక్టార్లలో సాగు

నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 2,868 హెక్టార్లలో రైతులు పెసర పంటను సాగుచేశారు. కంచికచర్ల మండలంలో 1,980 హెక్టార్లు, నందిగామ మండలంలో 55 హెక్టార్లు, వీరులపాడులో 786 హెక్టార్లు, చందర్లపాడు మండలంలో 47 హెక్టార్లలో పెసర సాగుచేశారు.



పెసలు

తగ్గిన దిగుబడులు

ఈ ఖరీఫ్ సీజన్‌లో పెసర ఆశించిన దిగుబడి రాలేదు. గతంలో ఆరు క్వింటాళ్ల పెసలు దిగుబడి వస్తే ఈ ఏడాది మూడు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చిందని రైతులు వాపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో ఆశించిన మేరకు పెసర పంట దిగుబడులు రాలేదని రైతులు చెబుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వం రైతులు నుంచి పెసలు కొనుగోలు చేయకపోవటంతో దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు వస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో లాభాలు

2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో పెసలకు మద్దతు ధర క్వింటా రూ. 8,768 కేంద్రం ప్రకటించింది. అయితే మార్కెట్‌లో ప్రస్తుతం సూపర్ డీలక్స్(పచ్చ పెసలు) క్వింటా రూ.6వేలు పలుకుతున్నాయి. రెండో క్వాలిటీగా పిలిచే రంగుమారిన పెసలు క్వింటా రూ. 2,000 నుంచి రూ.2,500కు మించి పలకటం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2023-24 సంవత్సరంలో సూపర్ డీలక్స్‌గా పిలిచే పచ్చ పెసలు క్వింటా రూ. 9,100 నుంచి రూ. 9,700 ధర పలికింది. రెండో క్వాలిటీ పెసలకు సైతం క్వింటా రూ.4,500 నుంచి రూ.6వేల మధ్య పలికింది. మంచి లాభాలను కళ్లారా చూసామని రైతులు చెబుతున్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పెసలకు కనీస మద్దతు ధర దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


60 ఎకరాల్లో పెసర పంట సాగుచేశా



మోగులూరు గ్రామంలో 60 ఎకరాల్లో పెసర పంట సాగుచేశా. ఈ ఏడాది మూడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. గతంలో ఆరు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పెసర పంట గిడ్డంగిలో నిల్వ ఉంచా. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో నష్టం వస్తుంది. అందువల్ల ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయాలి.

– వేజండ్ల శ్రీనిబాబు రైతు, మోగులూరు, కంచికచర్ల మండలం

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన మేర దిగుబడి రాలేదు. మధ్య దళారులు మాత్రం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఆ ధరతో పూర్తిగా నష్టం వస్తుంది. ప్రభుత్వం ఇప్పటికైనా మార్క్‌ఫెడ్ ద్వారా పెసలను కొనుగోలు చేయాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్వింటా పెసలు రూ. 9,500కు కొనుగోలు చేశారు. బాగానే ధర పలికింది. ఈ ఏడాది ఆశించిన మేరకు దిగుబడి రాలేదు. ప్రభుత్వం పెసర పంటను సాగుచేసిన రైతులను ఆదుకోవాలి.

– గుదే అక్కారావు రైతు, గొట్టుముక్కల, కంచికచర్ల మండలం

వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలి



వేద సభను నిర్వహిస్తున్న పండితులు

విజయవాడ కల్చరల్: వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలని విశ్వమాతా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో మంగళవారం వీరుభట్ల ఫణికుమార్ నేతృత్వంలో వేద సభ, పండిత సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. సభను ప్రారంభించిన రమాసత్యనారాయణ మాట్లాడుతూ.. వేదాలు భారతీయ ఆత్మగా అభివర్ణించారు. సర్వవేద సారం వేదాలలో నిక్షిప్తమై ఉన్నాయన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు చెందిన విషయాలు వేదంలో వివరించారన్నారు. లోక శ్రేయస్సు కోసం 24 ఏళ్లుగా చండీ సప్తశతి యాగం నిర్వహిస్తునట్లు తెలిపారు. వేదపండితులు నాలుగు వేదాలను పారాయణం చేశారు. అనంతరం రమాసత్యనారాయణ దంపతులు పండితులను ఘనంగా సత్కరించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



కూచిపూడి నృత్య ప్రదర్శనలో అజయ్‌కుమార్ బృందం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాటక అకాడమీ, విజయవాడ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం కార్యక్రమంలో చింతా వెంకటరామాంజనేయులు కూచిపూడి సంప్రదాయంలో అన్నమయ్య, రామదాసు కీర్తనలకు నృత్యాలను అభినయించారు. యువ సంగీత కళాకారిణి జి.శాంతి వాగ్గేయకారుల కీర్తనలను మధురంగా ఆలపించారు. సంగీత కళాశాల నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్‌కుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో నృత్యాలను అభినయించారు. కాకినాడకు చెందిన తోట సుబ్రహ్మణ్యం బృందం ప్రదర్శించిన తోలు బొమ్మలాట ఆసక్తికరంగా సాగింది. భాషా సాంస్కృతిక శాఖ మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి కార్యక్రమాలను పర్యవేక్షించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నాగ మనోజ్ఞ, భవ్విక సాయి, సంజనా రెడ్డిలు కూచిపూడి నాట్యాలను ప్రదర్శించారు. వెంకటేశ్వర్లు వీరనాట్యం అంశాన్ని ప్రదర్శించారు. డాక్టర్ పీవీఎన్ కృష్ణ ఖడ్గతిక్కన పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు.

దుర్గమ్మను దర్శించుకున్న సినీనటి హేమ



మీడియాతో మాట్లాడుతున్న హేమ

వించిపేట(విజయవాడ పశ్చిమ): దసరా ఉత్సవాలలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారిని మంగళవారం సినీ నటి హేమ దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆమెకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం మీడియా పాయింట్‌లో ఆమె మాట్లాడుతూ.. ఏటా అమ్మవారిని క్రమం తప్పకుండా దర్శించుకుంటున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు తనపై పుష్కలంగా ఉన్నాయని.. తనపై ఉన్న నీలాపనిందలు తొలగిపోయి సంతోషంగా ఉన్నానని.. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆమె పేర్కొన్నారు.

గ్రామ దేవతలకు బోనాల సమర్పణ

జి.కొండూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా మునగపాడు గ్రామంలో గ్రామ దేవతలకు బోనాల సమర్పణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల నుంచి బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి గ్రామంలోని మహాలక్ష్మమ్మ, ముత్యాలమ్మ, గంగానమ్మ, దుర్గమ్మ, బొడ్రాయిలకు బోనాలు సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.